# తరం... తరం.....

డా॥ ఎ. సీతారత్నం

ఇండియా వచ్చిన భాకె చాలచోట్ల తిరిగింది. చాలా సమాచారం సేకరించింది. తనకి బంధువులవుతారన్న వారి నందరినీ కలిసింది. ఆమె తెలుగే మాట్లాడుతున్నా దూరంగా ఉన్న వారందరికీ ఇంగ్లీషులోనే మాట్లాడుతున్నట్టుగా ఉంది. దగ్గరగా, శ్రద్ధగా విన్నవారికి మాత్రమే ఆమె తెలుగు అర్ధమవు తోంది. చాలా కష్టపడి తన తాత ముత్తాతల గురించి తెలుసుకొని వంశవృక్షం తయారుచేసింది. వంశవృక్షం అంటే మగవాళ్ళదే తీసుకోవడం భాకెకి నచ్చదు. తనకి తెలిసి అప్పాయమ్మ అనే ఆమె మొదటి తరం స్త్రీ.

✿ ✿ ✿

అప్పాయమ్మకి ఎనిమిది సంవత్సరాలకే పెళ్ళి అయింది. 14వ కోడలుగా అత్తింటికి వెళ్లింది. అంతమంది బావలు, తోడికోడళ్ళ మధ్య భయం భయంగా గడిపింది. పదహారేళ్ళకే భర్తపోయి కూతురుతో అత్తింటికి చేరింది. తన కూతురుకి కొంచెం పెద్దయ్యాక పెళ్ళి చెయ్యాలనుకొంది.

✿ ✿ ✿

అప్పాయమ్మ కూతురు రావాయమ్మ 13 ఏళ్లకి పెద్ద పిల్లయ్యాక పెళ్లి చేసారు. కానీ పిల్ల సన్నగా పీలగా ఉండటంతో, "పిల్ల కాస్త రొక్కన్నాక పంపండి" అని పుట్టింటికి పంపేరు. పెద్ద విసరలి పెట్టి మినుములు విసిరి సున్నుండలు చేసి రోజు మూడుపూటలా తినబెట్టింది తల్లి. ఆవుకి ఉలవలు, తనకి మినుములు అనుకొనేది రావాయమ్మ. నెలా పదిహేను రోజులకి భర్తమేనత్త వచ్చి చూసి "ఇంకో నెల మీ దగ్గరే ఉండనివ్వండి" అని "బాగా తిని కాస్త మనిషివి కనబడూ... వాడు ఏ బజారున పడతాడోనని భయం..." అని వెళ్ళడంతో తన కూతురుకి చస్తే 13 ఏళ్ళకి పెళ్ళి చెయ్యను" అనుకొంది.

✿ ✿ ✿

అప్పాయమ్మ కూతురు వెంకాయమ్మకి పదహారేళ్ళకి బాగా ఎదిగిందన్పించేక చేసింది. 5వ తరగతి అయినా చదివంచలేదను కొంది వెంకాయమ్మ. చాకలి పద్దు కూడా వేసుకోవడం రాదు. నా కూతురుని ఇలా చెయ్యననుకొంది.

✿ ✿ ✿

ఆరుగురు మగబిడ్డల తర్వాత మహాలక్ష్మమ్మ పుట్టింది. అందరూ ఎంతో గారంగా చూశారు. చదివిద్దామంటే మాత్రం ఎవ్వరూ ఒప్పుకోలేదు. ఎంతో బ్రతిమలాడిన తర్వాత ఇంటికి వచ్చి ఆచారిగారు అక్షరాలు నేర్పి చదివించడానికి ఏర్పాటు చేసింది. అన్ని ఏర్పాట్లు అయ్యేసరికి ఏడేళ్ళు వచ్చాయి. పన్నెండో ఏటే పెద్దపిల్లయ్యేసరికి మాన్పించేశారు. మహాలక్ష్మి చాలా బాధపడింది. స్కూలుకి పంప లేదనుకొంది.

✿ ✿ ✿

మహాలక్ష్మి కూతురు తాయారుని ప‹ దలగా స్కూల్‌కి పంపింది. చిన్న పిల్లని ఆ‹ సంవత్సరాలు వయస్సు దాటాక పంపారు. అయిద తరగతి దాకా చదివింది. తల్లి మురిసిపోయింది కానీ ఆ సంవత్సరం వేసవి కాలంలో పెద్దదయింది. ఫంక్షన్ భారీ ఎత్తున చేసారు. చుట్టాలంతా వచ్చారు. అంతా కలిసి ఇంక స్కూల్‌కి పంపడం మంచిది కాదని తీర్మానించేసారు. దానికి తోడు తండ్రిపోలిక వచ్చిన తాయారు కాస్త వొడ్డూ, పొడవుతో వయసుకి మించి కనబడుతుంది. అందుకని మహాలక్ష్మి కూడా పోన్లే మొగుడికి ఉత్తరం రాయగలదు. చాకలి పద్దు చూడగలదు... అని సరిపెట్టుకొంది. కానీ తాయారుకి చాలా అసంతృప్తి ఎన్నో రోజులు పెరట్లో చింతచెట్టు కింద కూర్చొని ఒంటరిగా ఏడ్చింది కూడా చదువు ఆపేసినందుకు.

✿ ✿ ✿

తాయారుకు ముగ్గురూ మగబిడ్డలే పుట్టారు. అంతా అదృష్టవంతురాలివి అన్నారు. కానీ తాయారుకి అసంతృప్తి. చక్కా ఆడపిల్ల పుడితే తనలాగ కాకుండా బాగా చదివించాలనుకొంది. అలా చింతిస్తున్నప్పుడే వాళ్ళ చెల్లికి కవలపిల్లలు ఆడపిల్లలు పుట్టారు. అప్పటికే ఆమెకు నలుగురు ఆడపిల్లలు. వాళ్లని అడిగి ఒక ఆడపిల్లని పెంపకానికి తెచ్చింది. ఆ అమ్మాయే నాగమణి. నాగమణిని ఇంటర్‌దాకా చదివించింది. భర్తకి ఇష్టం లేకపోయినా బ్రతిమలాడి అలిగి పనిమనిషి, చాకలిని మాన్పించి ఇంటి పనంతా తానే చేసుకొని ఆ డబ్బుతో ఫీజు కట్టింది. డిగ్రీ చదివితే డిగ్రీ చదివిన భర్తని తేవాలని మరి చదివించలేదు. తాయారుకి కూడా నిజమేనన్పించింది. నాగమణికి మాత్రం అసంతృప్తి, డిగ్రీ చదివి ఉద్యోగం చేసుకొందా మంటే వీళ్ల ఛాదస్తంతో నన్ను చదివించలేదనుకొంది.

✿ ✿ ✿

నాగమణి కూతురు కమల పి.జి.దాకా చదివింది. ఉద్యోగ ప్రయత్నం చేసింది. ఢిల్లీ దగ్గర వచ్చింది. ఇంట్లో అంతా వొక్కరు వెళ్ళి ఉద్యోగం చెయ్యనవసరం లేదని తీర్మానించారు. నాగమణి మనసు బాధపడింది. తన కూతురుకి ఏ అసంతృప్తి లేకుండా చూడగలను అనుకొంది కానీ అవలేదు. పెళ్లయ్యాక నీ భర్తని వొప్పించి హాయిగా చేసుకో అంది. కమల ఆశ తీరలేదు. భర్త అస్సలు ఒప్పుకో లేదు. ఆడవాళ్లకి ఉద్యోగాలు దేనికి అన్నాడు. కమల కూతురు శివ ప్రియని మాత్రం ఉద్యోగం చేసుకోనిచ్చే వాడికి ఇచ్చి చెయ్యాలనుకొంది.

✿ ✿ ✿

శివ ప్రియతల్లి ప్రోత్సాహంతో బి.టెక్ చేసింది. వెంటనే ఉద్యోగం వచ్చింది. ఢిల్లీ పంప

నికి తండ్రి సంశయించినా కమల సపోర్ట్‌తో ళ్ళింది. శివప్రియ ఏడాది అవగానే తనికి హకరించిన స్నేహితుడు వేరే కులస్తుడ్ని పెళ్లి సేసుకుంటా నని వ్యక్తం చెయ్యగానే తల్లీ తండ్రీ ఢిల్లీ పరిగెత్తారు. బ్రతిమలాడి, భయపెట్టి ఎలాగైతే మనసు మార్చేసారు. వేరే వ్యక్తితో పెళ్ళి చేసారు. శివప్రియకి మాత్రం ఎంతో అసంతృప్తి.

✿ ✿ ✿

శివప్రియకి మొదటిసారి తల్లి కాబోతున్న ఆనందం ఆవిరి అయింది. స్కానింగ్‌లో ఆడపిల్లని తెలియగానే ఆమెకి చెప్పకుండానే అబార్షన్‌కి ఏర్పాటు చేసాడు. ఆమె దుఃఖం వినే నాథుడే లేడు. "అటు చదువు, ఇటు పెళ్ళికి... ఖర్చు.. తెల్లారి ఎన్ని చూస్తున్నాం పేపర్లో, ఇద్దరం ఇంట్లో ఉండం. పొద్దున్నే పోతే సాయంత్రం వస్తాం. ఆడపిల్లని safetyగా పెంచలేం. అందుకే చేయించాను. ఏదో అపరాధం చేసినట్టు మాట్లాడతావేం ?" అన్నాడు భర్త. మాట్లాడ డానికే ధైర్యం లేదు. ఏదో భయం. మరొక్క రెండేళ్ళకే భర్త యాక్సిడెంట్‌లో పోయాడు. దాంతో ఒంటరిగా మిగిలింది. ఏదో తెలియని బాధ. తప్పక ఉద్యోగం చేస్తోంది. అప్పుడే ఒక వార్త తెలిసింది. బీహార్ స్టేషన్‌లో ఆడపిల్లని చెత్తబుట్టలో పడేసారు. వార్తకి స్పందించి ఆ పిల్లని అతి ప్రయాశపడి తెచ్చి పెంచు కొని మనశ్శాంతి పొంది శాంతి అని పేరు పెట్టింది.

✿ ✿ ✿

శాంతి బి.కాం అవగానే అమెరికాలో ఎమ్.ఎస్. చేసింది. అక్కడే ఉద్యోగం, తల్లిని తీసుకు వెళ్ళింది. ఒకరోజు ఒక అమెరికన్‌ని పెళ్లి చేసుకుని వచ్చింది. ఎందుకో తల్లికి భయమేసింది. కొద్దిరోజు లుండి ఇండియా తిరిగి వచ్చింది. శాంతికి జీవ పుట్టింది. ఆ సమయంలో భర్త ఏ సహకారం పెద్దగా చెయ్యలేదు. ఓపిక లేకపోయినా సెక్స్‌కి ఫోర్స్ చేశాడని విడాకులు తీసుకొని వేరొకరిని పెళ్ళి చేసుకొంది. విడాకులకి , కోర్టు చుట్టూ తిరగడం చాలా విసుగ్గా అన్పించింది. ఆ సమయంలో సహకరించినతన్నే పెళ్ళి చేసుకొంది. కానీ తనలాగ ఈ పెళ్ళి రొంపిలోకి తన పిల్లని నెట్టకూడదనుకొంది.

✿ ✿ ✿

జీవని స్వేచ్ఛగా పెంచి, చదివించింది. డేటింగ్‌కి వాటికీ అడ్డుపెట్టలేదు 23 సం॥లు వచ్చాక మాత్రం ఎవరితోనైనా సహజీవనం పద్ధతిలో ఉండొచ్చుగా అని చెప్పింది కొద్దిగా మొహమాటంగా. ఏదో ఒక పద్ధతిగా వుండాలని ప్రతి తల్లీ అనుకొంటుం దేమో !

✿ ✿ ✿

జీవ మొదట జర్మనీ వ్యక్తితో ఉండి నచ్చక మరో అమెరికన్‌తో ఉండి. ప్రోజెక్ట్ కోసం మూడేళ్ళు కెనడాలోనే ఇద్దరూ ఉండవలసి వచ్చింది. అప్పుడు పుట్టింది పాప. ఇండియా వచ్చి తల్లిని చూసింది. శాంతి నవ్వుతూ Bhac అని పెట్టు పేరు అంది నవ్వుతూ. Bh – అంటే భారతదేశం, a – అమెరికా, c– కెనడా. భారతదేశం అమ్మది, అమెరికా నాన్నది. పుట్టిన ప్రాంతం కెనడా. సరదాగా అన్నప్పటికీ ఆ పేరే స్థిరం చేసింది జీవ. భాకేకి పది సంవత్సరాలు వచ్చేసరికి మరొక ఇటలీ స్త్రీతో కలిసి ఉండడం ప్రారంభించాడు. అతనికి దూరమయింది జీవ. "స్నేహ స్పర్శ" పోగానే దూరమవడమే మంచిదను కొంది.

✿ ✿ ✿

భాకేని మాత్రం శ్రద్ధగా పెంచింది. ఉద్యోగం మంచిది వచ్చింది. డబ్బుకి కొరతలేదు. భాకే సహజీవనం కూడా వద్దంది. తనకు నచ్చినవాళ్లతో ఉండడానికి సంకోచించదు. ఆ సంబంధాన్ని మరిపెంచుకోవడం అనవసరం అంటుంది. తను best sperm, best egg ని సెలక్ట్ చేసుకొని ఒక బిడ్డని పొందుతానంటుంది. జీవ రిస్క్ వుందేమో అని భయపడింది. తీరా అన్నీ అయ్యాక ఎవరైనా నీకు హక్కులేదంటే "నచ్చిన వ్యక్తితో గడిపి సహజంగా కనడం సులభం కదా" అంది జీవ. మంచి ప్రొడక్ట్ కోసం కష్టపడాలి అని అసలు తన అమ్మమ్మ వంశం రూట్స్ తెలుసుకోవాలని ఇండియా వచ్చింది.

పల్లెనుండి బస్సులో వస్తున్న భాకే సడన్‌బ్రేక్‌కి ముందుకు వొరగబోయి నిలదొక్కుకుని చేతిలో లేప్‌టాప్ పడిపోకుండ జాగ్రత్తపడి సరిగ్గా కూర్చుని 'అప్పాయమ్మ.కామ్' అనే వెబ్‌సైట్ తను క్రియేట్ చేసినది వోపెన్ చేసింది. వెబ్‌సైట్ చూడడంలో మునిగిపోయిన భాకే అరగంట తర్వాత బస్ ఆగి పోయిన విషయం గుర్తించింది. కింద గోలగోలగా వుంది. ఎవ్వరూ బస్సులో లేరు. పిల్లలు గట్టిగా ఏడుస్తున్నారు. ఏడుస్తున్న పిల్లల్ని ఎత్తుకొని ఊరుకో బెడ్తున్నారు. బస్సులో గాలికూడా లేదు. భాకే కూడా కిందికి దిగింది. చుట్టూ చీకటి. మిణుకు మిణుకు మంటూ చుక్కలు. దూరంగా కీచురాళ్ళ ధ్వని. మరో అరగంట అటు ఇటు తిరిగి కాలక్షేపం చేసాక డ్రైవరు కండక్టరు తెల్లారితే గాని ఏమీ చేయలేం అని తేల్చి చెప్పారు. రాత్రి 11:30 అయ్యింది. ఆకలి విప రీతంగా వేస్తోంది. ఏవీ లేవు. చుట్టుపక్కల చిన్న షాప్ కూడా లేదు. ముప్పావుగంట నడిస్తే బొబ్బిలి వస్తుంది. నడిచి వెళ్ళాలని సిద్ధ మవుతున్న వాళ్లతో కలిసి బయ ల్దేరింది. రోడ్డు మలుపుదాకా ఆ ఇద్దరూ వచ్చారు. తరువాత వారు పక్కబాట పట్టారు. సెల్ బ్యాటరీ వెల్తురులో కాసేపు నడిచి ఛార్జ్ అయిపోతుందని ఆపేసి అమావాస్య ముందరి వెన్నెలలో నడుస్తోంది. రోడ్డు రెండుప్రక్కలా ఉన్న పెద్ద చెట్లు ఎత్తుగా పెరిగి పైన చుట్టరికం చేస్తున్నాయి. ఆకుల మధ్య నుండి కురుస్తున్న వెన్నెలలో ఏదో తెలియని అనుభూతి. ఆనందాలతో తనను తానుమరిచి – తడిసిన ఆకులతో కప్పి ఉన్న చిన్నగోతిలో కాలువేసి గతుక్కుమంది. ఒక్కసారి గుండె ఝల్లుమంది. వెంటనే ఏమీ లేదని తెలియగానే పెదవి పైకి చిరునవ్వు వచ్చింది. ప్రకృతి ఎంత అందమైనదో అంత భయంకరమైనది. ఎంత ఆనందాన్నిస్తుందో అంత దుఃఖాన్ని ఇవ్వగలదు అనుకొంది. ఆ సుఖ దుఃఖాలనుభూతి పొందడానికి ప్రకృతిలో మమేక మవ్వాలన్పిస్తుంది. ప్రకృతిలోకి స్వేచ్ఛగా ఇష్టంగా కలవడానికేనిరంతర ప్రయత్నం. ఆ ప్రయత్నంలో ఏ బాహ్యనియమాలకు పెద్దరికాలకూ తలవొంచలేం అనుకొంది భాకే.

కజిన్‌ని, అమ్మమ్మని సెల్ సాయంతో అడ్రస్ అడిగి తెలుసుకొని తలుపు తట్టింది. అమ్మమ్మ చెప్పిన ఏవరసో తన బుర్రకి ఎక్కకపోయినా "ఆంటీ" అని పిలిచింది.

తలుపు తీసిన వ్యక్తి "రా అమ్మా !" అన్నాడు అప్యాయంగా. మొహమాటంగా లోపలికి అడుగు పెట్టింది. మంచినీళ్ళు తెచ్చి ఇచ్చారు ! అతను చాలా పొడవుగా, కొద్దిగా లావుగా తెల్లగా 60 ఏళ్లు దాటిన వయసుతో ఆరోగ్యంగా కన్పించాడు. తెల్లని లాల్చీ పైజమాతో చాలా హుందాగా ఉన్నారు ! రామనాధం గారంటే మీరేనా !" "అవునమ్మా, టీ తాగుతారా ? భోంజేస్తారా?"

"టీ తాగి స్నానం చేసి భోంచేస్తా" అని "ఇబ్బందయితే టీ అక్కర్లే"దంది.

"ఫరవాలేదు" అని నవ్వి వెళ్లి ఫ్లాస్కులో టీ తెచ్చి ఇచ్చాడు.

స్నానం చేసి వచ్చి "ఆంటీ ఏది?"

ఇప్పుడే పడుకుంది.

"భోజనం చేసి పడుకో" అని భోజనం అయ్యేదాకా ఉండి గది చూపించి వెళ్ళిపోయాడు.


## శుభాకాంక్షలు ఇలా....

పుట్టినరోజు, వివాహ, పదవీ విరమణ శుభా కాంక్షలు,ఇతర విషయ సమాచారాలు చినుకులో ప్రకటనల ద్వారా తెలపాలనుకునేవారు ముందుగా ఫోటోతో సహా వివరాలను చినుకు కార్యాలయానికి రూ॥200/–లు ఎం.ఓ ద్వారా పంపండి. ప్రకటన పడిన సంచికను మీతో పాటుగా మీరు కోరిన ఐదుగురికి పోస్టుద్వారా పంపడం జరుగు తుంది.